క్లుప్తంగా

నేడు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ బలరాముడు

సి.బెళగల్: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్ష జరగనున్నట్లు.. విద్యార్థులు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ బలరాముడు అన్నారు. శనివారం వైస్ ప్రిన్సిపాల్ విజేయుడు, సిబ్బందితో కలిసి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 922 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశ పరీక్షకు 825 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు వెంట తీసుకుని రావాలని సూచించారు.

అశోకాలో ఘనంగా ఈ-క్యూబ్ ఉత్సవాలు

కల్లూరు: దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ-క్యూబ్ 2025 ఉత్సవాలు ఏప్రిల్ 8 నుంచి 12 వరకు ఘనంగా జరిగాయి. ఐదు రోజుల వేడుకల్లో భాగంగా సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్, సీఈఓ హరీష్ కృష్ణ, చైర్మన్ అశోక్ వర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు



క్రేన్ సాయంతో ఏర్పాటు చేస్తున్న ఆంజనేయస్వామి విగ్రహం

కోడుమూరు రూరల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శనివారం గూడూరు పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో 21 అడుగుల ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాహకుడు, గ్రామ వికాస సమితి జిల్లా కన్వీనర్ దమాం సురేష్ మాట్లాడుతూ.. ఊరి క్షేమాన్ని కాంక్షిస్తూ 21 అడుగుల ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వచ్చే శ్రావణ మాసంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మలేష్‌నాయుడు, నాయకులు రామ్‌రాజ్, చిన్న సత్యనారాయణ, రాజేష్, శంకర్, వెంకటేష్, నవీన్, మధు, ఆనంద్, హరి, భీమేష్, శ్రీను, బలరాం పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



సుంకులాపరమేశ్వరి దేవి రథోత్సవంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : కల్లూరు అర్బన్ 34వ వార్డు బృందావన్‌నగర్‌లో వెలసిన సుంకులాపరమేశ్వరి దేవి రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొని అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎరుకల వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో కాటసాని

పాణ్యం : మండల పరిధిలోని రసూల్లపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పొంకం రమణ కుమారుడి వివాహానికి నంద్యాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులనుఆశీర్వదించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, వడ్డుగండ్ల రాముడు, ఎల్లక్రిష్ణ, కుసుమన్న తదితరులు పాల్గొన్నారు.

పర్లలో భీరలింగేశ్వర స్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కల్లూరు: మండల పరిధిలోని పర్ల గ్రామంలో భీరలింగేశ్వర స్వామి విగ్రహానికి శనివారం గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం భీరలింగేశ్వర స్వామి విగ్రహం, గణపతి, కలశ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.

ఇంటర్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కల్లూరు: ఇంటర్మీడియెట్ ఫలితాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల చిన్నటేకూరు ఐఐటీ, మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభచాటారు.అకాడమిలో ద్వితీయ సంవత్సరం (ఎంపీసీ, బైపీసీ)లో మొత్తం 108 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 99శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం (ఎంపీసీ, బైపీసీ) గ్రూపులకు చెందిన 101 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 98.02శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కార్తీక్ రెడ్డి 980, బైపీసీలో సురేంద్ర- 977, రాజ్ కుమార్- 977 మార్కులు సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీలో సాగర్ - 464, బైపీసీలో కె. నిఖిల్ 434 మార్కులు సాధించారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంపై కర్నూలు జిల్లా గురుకులాల సమన్వయకర్త డాక్టర్ ఐ. శ్రీదేవి డైరెక్టర్, అధ్యాపకులను అభినందించారు.

కస్తూర్బాలో వందశాతం..

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) మైనార్టీ విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ ఉమాదేవి తెలిపారు. మొత్తం ప్రథమ సంవత్సరం 36 మంది విద్యార్థినిలు, ద్వితీయ సంవత్సరం 27 మంది విద్యార్థినిలు హాజరు కాగా అందరు పాస్ అయ్యారని చెప్పారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ గ్రూపులో ద్వితీయ సంవత్సరానికి చెందిన బి. శిరీషా 972/1000, మనీషా 970/1000, హాజీరబాను 968/1000 సాధించారు. మొదటి సంవత్సరంలో ఎస్. అఫ్రీన్ 491/500, కె. నూర్జహాన్ 489/500, ఎస్. హాసినాబీ 487/500 సాధించారు.


కార్తీక్ రెడ్డి,


సురేంద్ర,


రాజ్‌కుమార్,


సాగర్,


కె.నిఖిల్


బి. శిరీషా,


ఎస్.అఫ్రీన్,


ధనలక్ష్మి,


ఇ. మనుషా,


మీనాక్షిబాయి

- పెద్దపాడులోని ఏపీ మోడల్ స్కూల్ ద్వితీయ సంవత్సరం 80 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణతతో 75 శాతం సాధించినట్లు, మొదటి సంవత్సరంలో 110 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 77 మంది ఉత్తీర్ణులై 70శాతం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఈరన్న రావు, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జూనియర్ ఎంఈసీలో ఎన్కె. హసినీ 472/500, జూనియర్ సీఈసీ బి.భవానీ 440/500, జూనియర్ బైపీసీ బి. మీనాక్షిబాయి 420/440, జూనియర్ ఎంపీసీ ఇ. మనుషా 462/470 మార్కులు సాధించారు. అలాగే సీనియర్ సీఈసీ ఎన్కే జ్యోతి 900/1000, సీనియర్ ఎంపీసీ ఎ. వివేక్ పవన్ సాయి 941/1000, సీనియర్ బైపీసీ జి. ధనలక్ష్మి 958/1000 మార్కులు సాధించారు.
- చిన్నటేకూరు గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ సంవత్సంలో 124 మంది పరీక్షలకు హాజరు కాగా 122 మంది ఉత్తీర్ణతతో 98.4 శాతం, మొదటి సంవత్సరంలో 111 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 108 మంది ఉత్తీర్ణతతో 97.30 శాతం సాధించినట్లు అధ్యాపకులు తెలిపారు. జూనియర్ ఎంపీసీ పి. కృష్ణ సాయి 462, జూనియర్ బైపీసీ ఎం. చరణ్ 427 మార్కులు, సీనియర్ ఎంపీసీ కె. మనోజ్ కుమార్ 961, సీనియర్ బైపీసీ పి. ఇమ్మానుయేలు 961 మార్కులు సాధించారు.

పాణ్యం కళాశాలలో 92 శాతం ఫలితాలు


అరుణబాయి


మౌనిక బాయి

పాణ్యం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరంలో 84 మంది పరీక్ష రాయగా 77 మంది పాసై 92శాతంగా ఉత్తీర్ణత నమోదైంది. ఒకేషనల్ 35కి 35 మంది పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో హేమశ్రీ 945 సాధించింది. ప్రథమ సంవత్సరంలో 94మంది గాను 72 మంది ఉత్తీర్ణత సాధించగా 76శాతంగా నమోదైంది. బైపీసీలో సమీరా 404 మార్కులు సాధించినట్లు ప్రన్సిపాల్ రామన్ తెలిపారు.

- అలాగే నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 121మంది గాను 118 ఉత్తీర్ణత సాధించి 97.శాతం నమోదైనట్లు ప్రిన్సిపాల్ రామ్ నాయక్ తెలిపారు. ఎంపీసీలో అరుణబాయి 970 మార్కులు సాధించిందని చెప్పారు. మొదటి సంవత్సరంలో 158 గాను 155మంది ఉత్తీర్ణత సాధించి 98.శాతంగా నమోదైనట్లు వెల్లడించారు. ఏఅండ్‌టీలో మౌనిక 454 మార్కులు సాధించిటనట్లు తెలిపారు.
- ఏపీ మోడల్ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరంలో 44 మందికి గాను 42మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో సరిత 942 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ దినేష్ తెలిపారు. మొదటి సంవత్సరంలో 46మంది గాను 41మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీలో భాగ్యశ్రీ 452వమార్కులు సాధించిందని చెప్పారు.

ఓర్వకల్లులో 77 శాతం ఉత్తీర్ణత


ఎం. గాయత్రి, (మోడల్ స్కూల్)


హసీన (ప్రభుత్వ కళాశాల)

ఓర్వకల్లు : మండలంలోని వేర్వేరు జూనియర్ కళాశాలల్లో శనివారం వెలువడిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆర్ఐఓ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గురువయ్యశెట్టి వెల్లడించారు. స్థానిక ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 29 మంది పరీక్షలు రాయగా, 19 మంది పాసై 68 శాతం, ఏపీ మోడల్ స్కూల్ కళాశాలలో మొత్తం 53 మందికి గాను 44 మంది పాసై 83 శాతం చొప్పున మొత్తం రెండు కళాశాలల్లో కలిపి 81 మంది పరీక్షలకు హాజరుకాగా, 63 శాతం మంది పాసై 77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వెల్లడించారు. మొదటి సంవత్సరంలో మోడల్ కళాశాలలో 64 మంది పరీక్షలకు హాజరుకాగా, 32 మంది పాసై 50 శాతం, రెండో సంవత్సరంలో 54 మంది పరీక్షలు రాయగా, 21 మంది పాసై 39 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మోడల్ కళాశాలలో సీనియర్ బైపీసీలో కె.గాయత్రి 934, ఎంపీసీలో పి.శాలిని 932 మార్కులు సాధించారన్నారు. ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండవ సంవత్సరం హెచ్ఈసీలో పీ.హసీనా 916, సీఈసీలో ఎం.మమత 784/1000 మార్కులు సాధించారని ప్రన్సిపాళ్లు జోషులా వాట్స్, గురువయ్యశెట్టి వెల్లడించారు. స్థానిక కస్తూర్బా విద్యాలయంలో రెండవ సంవత్సరంలో ఐదుగురు ఉండగా అందరూ పాసై 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల ఇన్‌చార్జి ఎస్ఓ రాజేశ్వరి తెలిపారు. ఇందులో బి.హరిత 913/1000 మార్కులు సాధించినట్లు చెప్పారు.


బి.హరిత(కెజీబీవీ

సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి







షమీనా, ఎంపీసీ-982, రవితేజ, ఎంపీసీ- 981,ప్రియాంక, బైపీసీ-978, సుస్మిత, బైపీసీ-959, నందిని, బైపీసీ-952

కోడుమూరు రూరల్: ఇంటర్ ఫలితాల్లో కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన షమీనా సెకండియర్ ఎంపీసీలో 1000 మార్కులకు 982 మార్కులతో ప్రతిభ చాటింది. ఇదే కళాశాలకు చెందిన లలిత బైపీసీలో 957మార్కులు సాధించింది. అలాగే కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో మొత్తం 32 మంది విద్యార్థినులు పరీక్ష రాయగా 29మంది పాసయ్యారు. ఇందులో సునీత 440 మార్కులకు గాను 393, శ్రీలేఖ 395, ధనిత 391 మార్కులు సాధించారు. సెకండియర్ బైపీసీలో 36 మందికి గాను 35 మంది ఉత్తీర్ణత సాధించారు. సుస్మిత 959, నందిని 952, హరిత 922 మార్కులు సాధించారు. కోడుమూరు మోడల్ స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో సుజయ్ 399, బైపీసీలో షేక్ సన 395, సీఈసీలో అపర్ణ 374 మార్కులు సాధించగా, సెకండియర్‌కు సంబంధించి మొత్తం 74 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 58మంది పాసయ్యారు. బైపీసీలో సుమతి 914 మార్కులు, ఎంపీసీలో లావణ్య 940 మార్కులు సాధించగా, సీఈసీలో శ్రీనాథ్ 835 మార్కులతో పాసైనట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు పద్మావతి, గౌసియాబేగం, ఆశాజ్యోతి తెలిపారు.

గూడూరు విద్యార్థుల ప్రతిభ

గూడూరు జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో 71 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 31 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 48 మందికి గాను 39 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ రమణ తెలిపారు. ఫస్టియర్ బైపీసీలో జాన్సీ 411 మార్కులు, నందిని 390 మార్కులు, ధనలక్ష్మి, పెద్ద రాయుడు 383 మార్కులు, ఎంపీసీలో అశోక్ 421మార్కులు, సీఈసీలో కార్తీక్ 433 మార్కులు సాధించగా, సెకండియర్ బైపీసీలో మయూరి 919 మార్కులు, లలిత 892 మార్కులు, హెచ్ఈసీలో విజయుడు 937మార్కులు, ఈశ్రమాన్ 892 మార్కులు సాధించిన ప్రిన్సిపాల్ రమణ వెల్లడించారు.




మయూరి, బైపీసీ-919, జాన్సీ, బైపీసీ-411

కూలీ కుమార్తెకు 982 మార్కులు



కోళ్లఫారంలో పనిచేస్తున్న షమీనా తండ్రి చిన్నయ్య

కోడుమూరులోని నిరుపేద కుటుంబానికి దూదెకుల చిన్నయ్య, ఫాతిమా దంపతుల కుమార్తె షమీనా కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతూ శనివారం వెలువడిన ఫలితాల్లో ఎంపీసీలో 982 మార్కులు సాధించి సత్తా చాటింది. కుమార్తె అత్యధిక మార్కులు సాధించడంపై చిన్నయ్య మాట్లాడుతూ.. తాను కోళ్లఫారంలో దినసరి కూలిగా పనిచేస్తూ చదివించుకుంటున్నానని.. తమ కష్టాన్ని గుర్తించి మంచి మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే కుమారుడు మాలిక్‌ను డాక్టర్ చేయాలన్న లక్ష్యంతో లాంగ్‌టర్మ్ కోచింగ్ పంపగా, కుమార్తె షమీనాను కూడా షార్ట్‌టర్మ్ కోచింగ్ పంపానని, తమ పిల్లలిద్దరిని డాక్టర్, ఇంజినీర్ చేయాలన్నదే తన లక్ష్యమంటూ సంతోషంగా తెలిపారు.

సి.బెళగల్ విద్యార్థుల ప్రతిభ






విజయలక్ష్మి, బైపీసీ-964, ప్రదీప్‌కుమార్, బైపీసీ-955,రోహిణి, ఎంపీసీ-459, ఎస్తేరురాణి, బైపీసీ- 433

సి.బెళగల్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో సి.బెళగల్ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. మూడు ప్రభుత్వ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 154 మంది పరీక్షలు రాయగా 101 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా రెండో సంవత్సరంలో 158 మందికి గాను 131 మంది పాస్ అయ్యారు. బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో 68 మంది పరీక్షలు రాయగా 66 మంది పాస్‌తో 97 ఉత్తీర్ణత శాతం సాధించారు. జూనియర్ ఇంటర్‌లో 68 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 53 పాస్‌తో 78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సీనియర్ బైపీసీలో మల్లెపోగు ప్రదీప్ కుమార్ 1000 మార్కులకు 955 మార్కులతో ప్రతిభ చాటాడు. గుండుపోగుల ప్రదీప్ 931, సంధ్యపోగు దిలీప్ 930 మార్కులతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. అలాగే ఎంపీసీలో ఉప్పరి అభిరామ్ 922, అవుల జాన్‌వెస్లీ 915 ఉత్తమ మార్కులు సాధించారు. జూనియర్ ఎంపీసీలో అభిరామ్ 436, సంధ్యపోగు జశ్వంత్ కుమార్ 432, షావల సురేష్ 422, సుగాలి మహేష్‌నాయక్ 408, బైపీసీలో నత్తి రమణ 411 మార్కులతో టాపర్లుగా నిలిచారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ బలరాముడు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. సి.బెళగల్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో భారతి 910, అరుణ 909 ఉత్తమ మార్కులు సాధించారు. మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 63 మంది పరీక్షలు రాయగా 38 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ వంశీమోహన్ తెలిపారు. సెకండ్ ఇయర్ బైపీసీలో విజయలక్ష్మి 964, నస్రీన్ 928, సీఈసీలో క్రిష్ణవేణి 945 మార్కులతో జోరు చూపించారు. జూనియర్ ఎంపీసీలో రోహిణి 459, సరస్వతి 456, సరళ 442, బైపీసీలో ఎస్తేరురాణి 433, సువర్ణ 412, అనిత 408, సీఈసీలో దుర్గాభవాని 430, జోత్స్న 421, పుష్పావతి 416 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ వంశీమోహన్ వెల్లడించారు.

గడ్డివాముల దగ్ధం

పాణ్యం : మండల పరిధిలోని బలపనూరు గ్రామానికి చెందిన అబ్దుల్ అనే రైతుకు చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. శనివారం గడ్డివాములకు నిప్పు అంటుకోవడంతో గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపు కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా.. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. గడ్డివాములు విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు.

వైభవంగా సుంకులాపరమేశ్వరి రథోత్సవం

కోడుమూరు రూరల్: గూడూరు మండలం కె.నాగలాపురం గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరి తిరునాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం అమ్మవారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఆశీనులను చేశారు. అనంతరం రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు.



కె.నాగలాపురంలో రథోత్సవం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కమనీయం.. శ్రీవారి కల్యాణం

- కోలాహలంగా ఫలహారాల బండ్లు
- నేటి మహా రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



ప్రభోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో కోన వేంకటేశ్వరస్వామి,



శ్రీవారి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

సి.బెళగల్: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో జరుగుతున్న కోన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి అనంతరం ఒంటి గంట సమయంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. శనివారం తెల్లవారుజామున 5:15 గంటలకు ఉత్సవమూర్తులను ప్రభోపై ఉంచి గ్రామంలో ప్రభోత్సవం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి భక్తులు ఆలయ ఆవరణలో వంటావార్పు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామంలో స్వామివారి పల్లకీ సేవ నిర్వహించి ఉత్సవమూర్తులను కొండపై ఉన్న ఆలయానికి చేర్చారు. కొండపై హరేరామ కమిటీ సభ్యులు భజనలు చేశారు. అనంతరం మహాఘటాభిషేకం, శ్రీవారికి పంచామృతాభిషేకం నిర్వహించి సాయంత్రం రథాంగ హోమం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో కొండ దిగువకు చేర్చి మహా రథోత్సవానికి సిద్ధం చేశారు. భక్తులు స్వామివారి సన్నిధిలో చిన్నారులకు కేశఖండన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పెద్దనేలటూర్, పోలకల్, ఇనగండ్ల, సంగాల, కంబదహాల్, అలువాల గ్రామాలకు చెందిన భక్తులు ఫలహారాల బండ్లతో ఆలయానికి చేరుకుని స్వామివారికి సమర్పించారు. భక్తులకు ఈర్లదిన్నె గ్రామానికి చెందిన అట్ల ప్రతాప్‌రెడ్డి, అట్ల సరస్వతమ్మ దంపతులు అన్నదానం, వసతి కల్పించారు. శ్రీవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేకువజామున స్వామివారి రథోత్సవం జరగనుంది.



ఫలాహార బండ్లతో వచ్చిన భక్తులు

రమణీయం.. హనుమంతుని రథోత్సవం



జనసందోహం మధ్య ఆంజనేయస్వామి మహా రథోత్సవం,



పూజలందుకున్న హనుమంతుడు

- భారీగా తరలివచ్చిన భక్తులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని తెలుగు వీధిలో పడమటి ఆంజనేయవారి మహా రథోత్సవం శనివారం రమణీయంగా సాగింది. శోభా యాత్రలో భాగంగా ఉదయం ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకం, పత్రపూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు రథాంగ, రుద్రహోమాలు చేపట్టారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన మహా రథంపై స్వామి వారిని కొలువుదీర్చారు. శ్రీ ఆంజనేయం, రామ నామస్మరణ నడుమ ఆలయం నుంచి కొత్త బస్టాండ్ ఈశ్వరగుడి వరకు భక్తులు రథాన్ని లాగారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మహారథం రాత్రి 6:30 గంటలకు తిరిగి పడమటి ఆంజనేయస్వామి ఆలయం చేరుకుంది. కుస్మాండ బలితో హనుమాన్ జయంతి వేడుకలు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు.



రుద్ర హోమం నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు